నిలిచిన సేవలు.. అటకెక్కిన పథకాలు

- కూటమి పాలనలో ప్రజల గగ్గోలు
- సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం
- ఎన్నికల హామీల అమలులో జాప్యం

బుట్టాయగూడెం / చింతలపూడి : మహాత్మా గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ హయాంలో జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. ప్రతి 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించి ప్రభుత్వ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేశారు. ఇంటింటికీ రేషన్ అందజేశారు. అవినీతి, వివక్షతకు తావులేకుండా పాలన సాగించారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల సేవలను రైతులకు అందజేశారు. ఈ సేవలకు నేటి కూటమి ప్రభుత్వం మంగళం పాడుతోంది. ఒక్కొక్కటిగా సేవలను నిలుపుదల చేస్తోంది. వలంటీర్ వ్యవస్థ నిర్వీర్యం చేసింది. రేషన్ పంపిణీని షాపులకే పరిమితం చేస్తున్నారు. ఆర్‌బీకేల్లో కియోస్కో సేవలు నిలిపేసింది. కూటమి పార్టీలు అధికారం చేపట్టి ఏడాది గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలులో తీవ్ర నిర్లక్ష్యం అవలంబిస్తోంది.

- వైఎస్సార్ సీపీ హయాంలో పోలవరం నియోజకవర్గంలోని ఏడు మండలాల పరిధిలో సుమారు రూ.47.08 కోట్లతో 107 గ్రామ సచివాలయ భవనాలు, రూ. 23.50 కోట్లతో 107 రైతు భరోసా కేంద్రాలు, రూ.14.40 కోట్లతో హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. నాడు – నేడు పథకంలో సుమారు రూ.50.69 కోట్లతో 158 (వీటిలో పాఠశాలలు – 129, అంగన్‌వాడీ కేంద్రాలు – 19 , ప్రభుత్వ జూనియర్ కాలేజీలు – 6) ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చి ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా తీర్చిదిద్దారు. దీంతో గిరిజన గ్రామాల్లో రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి.
- చింతలపూడి నియోజకవర్గంలో 89 సచివాలయాలు, 89 రైతు భరోసా కేంద్రాలు, 61 హెల్త్ క్లినిక్ భవనాలు నిర్మించారు. పేదల అభ్యున్నతే ధ్యేయంగా గత ఐదేళ్ల పాలనలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ సంక్షేమానికి పెద్దపీట వేసింది.


బుట్టాయగూడెం : తెల్లంవారిగూడెంలో నిర్మించిన పాఠశాల భవనం


చింతలపూడి : జగన్ హయాంలో నిర్మించిన సచివాలయం, ఆర్‌బీకే


చింతలపూడి : రావికంపాడు సచివాలయంలో అందుబాటులో లేని సిబ్బంది



బుట్టాయగూడెం : మేడేపల్లిలో నిర్మించిన రైతు భరోసా కేంద్రం


బుట్టాయగూడెం : వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మించిన సచివాలయ భవనం

అబద్ధపు హామీలు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో ఇచ్చిన ప్రతి హామీని ఏడాదిలోపే అమలు చేశారు. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికీ ఐదేళ్లపాటు అందేలా కృషి చేశారు. 2024 ఎన్నికల్లో కూటమి నాయకులు అమలుకు సాధ్యంకాని హామీలు ఇచ్చారు. వాటిని అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నెరవేర్చకపోగా, ప్రజలకు ఉపయోగపడే పథకాలను రద్దు చేస్తున్నారు. కూటమి నాయకులు ఇచ్చిన హామీలన్నీ అబద్ధాలే. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే అమలు చేయాలి.

– తెల్లం బాలరాజు, మాజీ ఎమ్మెల్యే, దుద్దుకూరు, బుట్టాయగూడెం మండలం

సిబ్బందిని కుదించే కుట్ర



వైఎస్సార్ సీపీ హయాంలో తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం భ్రష్టుపట్టిస్తోంది. సచివాలయాల్లోని సిబ్బంది కుదించే కుట్ర చేస్తోంది. విత్తు నుంచి విక్రయం ద్వారా వ్యవసాయంతో అవసరమయ్యే ప్రతి సేవను వైఎస్సార్ సీపీ హయాంలో ఆర్‌బీకేల ద్వారా అందించారు. నేడు ఆ సేవలు సరిగా అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. స్థానికంగానే వైద్యం పొందేలా ఏర్పాటుచేసిన విలేజ్ క్లీనిక్‌ల పరిస్థితి అగమ్య గోచరంగా మారనుంది.

– ముప్పిడి వీరాంజనేయులు (అంజి), మున్సిపల్ వైస్ చైర్మన్, జంగారెడ్డిగూడెం

సచివాలయ వ్యవస్థ నిర్వీర్యం



వైఎస్సార్ సీపీ హయాంలో ఒకే చోట ప్రజలకు అందుబాటులో ఉంటూ, సచివాలయ సిబ్బంది ఇంటికే సంక్షేమ పథకాలు అందించేవారు. కూటమి ప్రభుత్వంలో సచివాలయ సేవలు ప్రజలకు అందుబాటులో లేవు. సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే విధంగా కుట్ర చేస్తున్నారు. ప్రజల వెళ్లినప్పుడు సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో కూటమి ప్రభుత్వంపై ప్రజలకు పూర్తిగా నమ్మకం పోయింది. సంక్షమాన్ని గాలికి వదిలేసింది.

– మేడూరి రంగబాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర పంచాయతీ విభాగం కార్యదర్శి, కామవరపుకోట మండలం

క్లుప్తంగా

బాలికలకు అవగాహన సదస్సు


రామానుజపురంలో ప్లకార్డులను ప్రదర్శిస్తున్న బాలికలు

కొయ్యలగూడెం: కొమర బాలికలు రుతుక్రమంపై అవగాహన కలిగి ఉండాలి అని బయ్యనగూడెం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యాధికారి వి.సత్యనారాయణ అన్నారు. బుధవారం రుతుక్రమ ఆరోగ్యం, పరిశుభ్రత దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలో రామనుజపురం గ్రామంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కొమార బాలికలు ప్ల కార్డులతో ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో డాక్టర్ గీతారాణి, ఆరోగ్య విస్తరణ అధికారి ఎల్.సుబ్రహ్మణ్యం, హెచ్ఎస్ చాన్ బాషా, హెచ్‌వీ మరియమ్మ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓగా నాగరాజ కుమారి బాధ్యతల స్వీకరణ


నాగరాజకుమారికి పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

టి.నరసాపురం: స్థానిక ఎంపీడీఓగా నాగరాజ కుమారి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆమె భీమడోలు ఎంపీడీఓ కార్యాలయ ఏఓగా పనిచేసి, పదోన్నతిపై ఇక్కడికి వచ్చారు. ఆమెకు కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఇక్కడ ఏఓ జి.మణికుమారి ఎంపీడీఓగా పూర్తి అదనపు బాధ్యతలు నిర్వహించారు.

అయ్యప్ప ఆలయంలో పూజలు


గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం సందర్భంగా విశేష పూజలు చేశారు. అయ్యప్పస్వామి మూలవిరాట్‌కు పంచామృతాభిషేకాలు, వివిధ పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

అన్నప్రసాద వితరణ


దాత ఉమామహేశ్వరిని సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక అశ్వారావుపేట రోడ్డులో ఉన్న వరసిద్ధి వినాయక స్వామి ఆలయంలో అన్నప్రసాద వితరణ చేశారు. ప్రతి బుధవారం అన్నప్రసాద వితరణ చేస్తున్నట్లు ఆలయ కమిటీ, అన్నప్రసాద వితరణ కమిటీ సభ్యులు తెలిపారు. బుధవారం అన్నప్రసాద వితరణకు ఎన్‌టీఆర్ పుట్టిన రోజు సందర్భంగా అభిమాని కానూరి నాగేశ్వరరావు, శీలి ఉమామహేశ్వరిలు సహకారం అందించారన్నారు. 1600 మంది అన్నప్రసాదం స్వీకరించినట్టు చెప్పారు. కార్యక్రమానికి సహకరించిన దాతలకు స్వామి వారి చిత్రపటం ఇచ్చి సత్కరించారు. శ్రీధరాల శ్రీనివాస్, చల్లా వరప్రసాద్, చెన్నూరి శివాజీకృష్ణ, రవీందర్‌రెడ్డి, కోటగిరి లక్ష్మీప్రసన్న, కానూరి గంగాధరరావు పాల్గొన్నారు.

పనులు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీడీఓ సరళ కుమారి

కామవరపుకోట: గ్రామాల్లో ఉపాధి హామీ పనులు త్వరగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ కె.సరళ కుమారి తెలిపారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఏఓ పవన్ కుమార్, ఏపీఓ మల్లేశ్వరరావు, పశు వైద్యాధికారి ఆదిత్య, ఏపీఎం సుబ్రమణ్యం, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎన్‌టీఆర్ జయంతి

జంగారెడ్డిగూడెం: టీడీపీ ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక ఏలూరు రోడ్డులో ఉన్న వాటర్ ట్యాంక్ నుంచి కొండ్రెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో పట్టణంలో మోటార్ సైకిళ్ల ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని పరిమి సత్తిపండు ప్రారంభించారు. కాకర్ల కాంప్లెక్స్ వద్ద ఎన్‌టీఆర్ విగ్రహానికి పట్టణాధ్యక్షులు రావూరి కృష్ణ, కొండ్రెడ్డి కిషోర్ పూలమాలలు వేసినివాళులర్పించారు. కేక్‌ను కట్‌చేశారు. పట్టణంలో ఉన్న పలు ఎన్‌టీఆర్ విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు, బ్రెడ్ పంపిణీ చేశారు.

వాడపల్లికి ప్రత్యేక బస్సు సర్వీసు

జంగారెడ్డిగూడెం: వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తుల సౌకర్యార్థం ప్రతి శనివారం ప్రత్యేక సర్వీసు నడుపుతున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. లక్కవరం, ఎ.కొత్తపల్లి, దూబచర్ల, నల్లజర్ల పరిసర గ్రామాల నుంచి వాడపల్లి వెళ్లే భక్తుల సౌకర్యార్థం ఈనెల 31 నుంచి జంగారెడ్డిగూడెంలో ఉదయం 04.30 గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. లక్కవరం, ఎ.కొత్తపల్లి, దూబచర్ల, నల్లజర్ల, తాడేపల్లిగూడెం, తణుకు మీదుగా వాడపల్లి వెళుతుందన్నారు. తిరిగి వాడపల్లిలో మధ్యాహ్నం 13.00కి బయలుదేరి అదే రూట్‌లో జంగారెడ్డిగూడెం వస్తుందని తెలిపారు.

రూ.10 వేల వేతనం ఇవ్వాలి

టి.నరసాపురం: సీనియర్ మేట్లకు రూ.10 వేలు వేతనం ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు డిమాండ్ చేశారు. మండలంలో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనుల ప్రదేశాలను నాయకులు సందర్శించి కూలీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల్లో కీలక పాత్ర పోషిస్తున్న సీనియర్ మేట్లకు కనీసం వేతనం అందించాలన్నారు. గత నాలుగు వారాల ఉపాధి పని సొమ్ము వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

సారా రహిత జిల్లాకు సహకరించండి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీలత

చింతలపూడి: సారా రహిత ఏలూరు జిల్లాను తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఏలూరు డిప్యూటీ కమిషనర్ శ్రీలత అన్నారు. మండలంలోని నాగిరెడ్డిగూడెం గ్రామంలో నవోదయం 2.0 కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సారా, మాదక ద్రవ్యాలు ఆరోగ్యాన్ని నాశనం చేయడంతో పాటు, కుటుంబాలను కూడా వీధిన పడేస్తాయని అన్నారు. ప్రతి ఒక్కరూ నాటు సారా, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రజలతో నాటుసారా నిర్మూలనకు ప్రమాణం చేయించారు. నాటుసారా తయారీ, అమ్మకాలు చేసే వారు వాటిని మానుకోవాలని, అలా చేసిన వారికి ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖల ద్వారా లోన్‌లు ఇప్పించేలా కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో డీపీఈఓ ఎ.ఆవులయ్య, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఈఎస్ సీహెచ్ అజయ్‌కుమార్‌సింగ్, ఈఎస్‌టీఎఫ్ ఏఈఎస్ జి.పాండురంగారావు, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, చింతలపూడి పోలీసు సీఐ రాజ్‌కుమార్, పోలీసు ఎస్సై కుటుంబరావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ వైవీఎస్ఎస్ ఫణికుమార్, నాగిరెడ్డిగూడెం ప్రజలు పాల్గొన్నారు.

- నాగిరెడ్డిగూడెంకు చెందిన ఇస్లావతు చిన్ని, వదిత్యా పార్వతి, వదిత్యా కుమారిలను చింతలపూడి తహసీల్దార్ వద్ద బైండోవర్ చేశామని చింతలపూడి ఎక్సైజ్ సీఐ పి.అశోక్ తెలిపారు.

‘పీజీఆర్ఎస్’ తీరు అపహాస్యం

కొయ్యలగూడెం: పబ్లిక్ గ్రీవెన్స్ పరిష్కారం వ్యవస్థ అధికారుల తీరు అపహాస్యంగా ఉందని బీజేపీ నాయకులు మల్లవరపు శ్రీనివాస్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొయ్యలగూడెంలోని నేషనల్ హైవే ఇరువైపులా డ్రెయినేజీపై ఉన్న ఆక్రమణలను తొలగించాలని పీజీఆర్ఎస్‌లో మార్చి 3న కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తనను ప్రశ్నించకుండానే సమస్య పరిష్కారమైందంటూ తన మొబైల్ ఫోన్‌కి ఆన్‌లైన్ ద్వారా సమాధానం పంపారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దాదాపు ఇదే సమస్యపై ఫిర్యాదు చేసిన వారికీ ఇదే విధమైన ఆన్‌లైన్ సమాధానాలు వస్తున్నాయేకాని, సమస్య మాత్రం పరిష్కరించడంలేదని వినియోగదారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏఆర్కే హనుమంతరావు పేర్కొన్నారు. సమస్య రహదారులు, భవనముల శాఖ జంగారెడ్డిగూడెం డీఈ ద్వారా పరిష్కరించాల్సి ఉందని ఆయన తెలిపారు.అన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణాభివృద్ధికి మున్సిపల్ కార్యవర్గం నిరంతరం కృషిచేస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక 20వ వార్డులో రూ.17 లక్షలు సాధారణ నిధుల నుంచి చేపట్టే రోడ్డు నిర్మాణానికి ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే పట్టణంలోని అనేక ప్రాంతాల్లో సీసీ రోడ్డు, డ్రెయిన్లు నిర్మించామని చెప్పారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. పట్టణ ప్రజలకున్న ఇబ్బందులను ప్రతి మూడో శనివారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో అర్జీ అందజేస్తే, పరిష్కారానికి కృషిచేస్తానని చెప్పారు. మున్సిపల్ వైస్‌చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్ కటారి వాసు, నాయకులు బత్తిన చిన్న, గూడపాటి రాధాకృష్ణ, మున్సిపల్ ఏఈ రాజేష్, కార్యదర్శి మనోజ్, వార్డు ప్రజలు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం టీడీపీలో లొల్లి

కొయ్యలగూడెం: టీడీపీ పట్టణ కమిటీ వివాదం తారాస్థాయికి చేరింది. టీడీపీ టౌన్ అధ్యక్షుడిగా గతంలోనే బాధ్యతలు నిర్వహించిన జేష్ఠ రామకృష్ణను రెండో దఫా కొనసాగిస్తూ ఇటీవల నిర్వహించిన సమావేశంలో ప్రకటించారని ఒకరు, కాలేదని మరొక వర్గం కీచులాడుకుంటున్నాయి. రామకృష్ణ నియామకం వ్యతిరేకిస్తున్నామంటూ ఒక వర్గం బాహాటంగా ప్రచారం చేస్తోంది. అదే సమయంలో రామకృష్ణకు అనుకూలంగా మరో వర్గం సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ వాగ్వివాదాలతో రక్తి కట్టిస్తోంది. ప్రభుత్వంలో భాగస్వామ్యంగా ఉన్నప్పటికీ కూటమిలోనే ఉప్పు, నిప్పుగా ఉన్న మిగిలిన పార్టీల శ్రేణులు ఈ వ్యవహారంపై లోలోన సంతోష పడుతూనే బయటకు గాంభీర్యం ప్రదర్శిస్తున్నట్టు చెబుతున్నారు.

పౌష్టికాహారం పంపిణీ


పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: రోటరీ క్లబ్ వృద్ధాశ్రమంలో బుధవారం వృద్ధులకు పౌష్టికాహారం, అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలను సురక్ష హాస్పిటల్ అధినేత శ్యామల దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గత 12 సంవత్సరాల నుంచి సురక్ష హాస్పటల్ సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నందుకు రోటరీ క్లబ్ సభ్యులు శ్యామలా దిలీప్ కుమార్ దంపతులను సత్కరించారు. వృద్ధులకు టానిక్‌లను, బలవర్ధకమైన పౌడర్లను క్లబ్బు సభ్యుల చేతుల మీదుగా అందజేశారు. వృద్ధాశ్రమంలో వృద్ధులతో మొక్కలు నాటించారు.

మౌలిక వసతులు కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత రవి

టి.నరసాపురం: ఏఎస్ఆర్ నగర్ నివాసులకు విద్యుత్, నీరు తదితర మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. సీపీఎం టి.నరసాపురం మండల కమిటీ సమావేశం పరగడ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. రవి మాట్లాడుతూ ఏఎస్ఆర్ నగర్ ఏర్పడి 17 సంవత్సరాలయ్యిందని, నేటికి అక్కడ విద్యుత్, మంచినీటి సౌకర్యం లేదని తెలిపారు. హైకోర్టు ఆర్డర్ ఉన్నప్పటికీ అక్కడ మౌలిక వసతులు కల్పించకపోవడం బాధాకరమన్నారు. పార్టీ మండల కార్యదర్శి మడకం సుధారాణి, సభ్యులు గుడెల్లి వెంకట్రావు, మడకం కుమారి, మొండ్రు శిరీష, బరగడ కుమారి, అనుమోలు మురళి తదితరులు పాల్గొన్నారు.

యోగా సాధన చేయాలి


యోగాసనాలు వేస్తున్న ప్రజాప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకుని సాధన చేయాలని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో బుధవారం యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రజాప్రతినిధులు, ప్రజలు యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో సర్పంచ్ యడ్లపల్లి రాధిక, ఉప సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, సచివాలయం సిబ్బంది, ఎన్‌ఆర్‌ఈజీఎస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలి

ఏలూరు (టూటౌన్): ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల ఆగడాలను అరికట్టాలని సీపీఎం ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల దౌర్జన్యంతో పెదవేగి మండలం కె.కన్నాపురం గ్రామానికి చెందిన కమిలి భాస్కరరావు ఆత్మహత్య చేసుకోవడం బాధాకరమని పేర్కొన్నారు. భాస్కరరావు ఆత్మహత్యతో అతని కుటుంబం రోడ్డున పడిందని తెలిపారు. భాస్కరరావు తన ఇంటి నిర్మాణానికి మహేంద్ర ఫైనాన్స్ కంపెనీ నుంచి తీసుకున్న అప్పు చెల్లించడంలో అలస్యం అవ్వడంతో రికవరీ ఏజెంట్లు అతనిపై తీవ్ర ఒత్తిడి తీసుకురావడం వల్లే ఆత్మహత్యకు పాల్పడినట్టు తెలిపారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ చేసి ఆత్మహత్యకు పాల్పడే విధంగా దోహదం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని, ఫైనాన్స్ కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భాస్కరరావు కుటుంబాన్ని ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. ప్రజలను ఇబ్బందులు పాలు చేసే ఇలాంటి ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టి వారి లైసెన్సులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నాణ్యమైన కూరగాయలు విక్రయించాలి


పత్తేబాద రైతు బజారులో కూరగాయలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రైతుబజార్లలో ప్రభుత్వం నిర్దేశించిన రేట్లకే కాయగూరలు విక్రయించాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి వ్యాపారులకు సూచించారు. స్థానిక పత్తేబాదలోని రైతుబజార్‌ను బుధవారం రాత్రి కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. కాయగూరల ధరలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతుబజార్లలో వ్యాపార దృక్పథంతో కాకుండా సేవా దృక్పథంతో వినియోగదారులకు సేవలందించాలని వ్యాపారులకు సూచించారు. తాజా కాయగూరలను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే అమ్మాలన్నారు. అధిక ధరలకు విక్రయించకుండా ఎస్టేట్ అధికారులు పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతుబజార్లో ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు చేయాలన్నారు. రైతుబజార్లలో పరిశుభ్రత పాటించాలని, టాయిలెట్లు కూడా శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మరమ్మత్తులకు గురైన పత్తేబాద రైతు బజార్లోని టాయిలెట్‌ను వెంటనే పునర్నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వినియోగదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రైతుబజారులో కలెక్టర్ స్వయంగా కాయగూరలు కొని, వాటి ధరలు రైతులకు చెల్లించారు. కలెక్టర్ వెంట ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్, వ్యవసాయ శాఖ, మార్కెటింగ్ శాఖాధికారులు, రైతుబజార్ ఎస్టేట్ అధికారి, పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు వేయించాలి


టీకాలపై తల్లులకు అవగాహన కల్పిస్తున్న మలేరియా అధికారి గోవిందరావు

ఏలూరు టౌన్: బిడ్డలు రోగాలబారిన పడకుండా ఆరోగ్యంగా ఉండేందుకు తల్లిదండ్రులు నిర్ణీత సమయంలో వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని ఏలూరు అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. బుధవారం ఏలూరులోని జ్వాలాపహరేశ్వరస్వామి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిరోధక టీకాల కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లలకు నిర్ణయించిన సమయంలో టీకాలు వేయాలని, ఈ టీకాలు క్షయ, పోలియో, రోటా వైరస్, కోరింత దగ్గు, రుబెల్లా, న్యుమోనియా లాంటి వాటికి ఉచితంగా వేస్తామని తెలిపారు. గర్భిణులు ధనుర్వాతం రాకుండా టీటీ ఇంజక్షన్ వేయించుకోవాలన్నారు. రాబోయే వర్షాకాలంలో తరచూ జ్వరాల బారిన పడే అవకాశం ఉన్న కారణంగా అశ్రద్ధ చేయకుండా వైద్య సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. యూపీహెచ్‌సీ జేపీ కాలనీ వైద్యాధికారి డాక్టర్ నీలిమ, హెల్త్ అసిస్టెంట్ మేకా శ్రీనివాసరావు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు ఉన్నారు.

హామీల అమలు కోరుతూ 2న ఆందోళన


సమావేశంలో మాట్లాడుతున్న ఆవుల శేఖర్

ఏలూరు (టూటౌన్): అర్హులందరికీ పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఇవ్వాలని, సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జూన్ 2న రాష్ట్ర వ్యాప్తంగా తహసీల్దార్ కార్యాలయాల వద్ద ఆందోళన చేయనున్నట్టు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కోటేశ్వరరావు, ఆవుల శేఖర్‌లు తెలిపారు. ఆ సంఘం ఏలూరు జిల్లా సమితి సమావేశం ఏలూరు స్ఫూర్తి భవనంలో బుధవారం నిర్వహించారు. కోటేశ్వరరావు, శేఖర్‌లు మాట్లాడుతూ చంద్రబాబు ఎన్నికల ముందు సూపర్ సిక్స్ హామీలు పక్కాగా అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి సంవత్సరం కావస్తున్నా హామీల అమలుపై మాట్లాడటం లేదని ఆరోపించారు. గతంలో చంద్రబాబు వన సంరక్షణ సమితులను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. నేడు అటవీ భూముల్లో వన సంరక్షణ సమితులు ఏర్పాటుకు అవకాశం కల్పించాలని కోరారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, చింతలపూడి, టి.నరసాపురం, జీలుగుమిల్లి, బుట్టాయిగూడెం, ఏలేరుపాడు, కుక్కునూరు, నూజివీడు ప్రాంతాల్లో ఉన్న అటవీ భూములను అక్కడి గిరిజన కుటుంబాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఉపాధి హామీలో చేసిన పనికి సక్రమంగా డబ్బులు ఇవ్వాలన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ జూన్ 10న భారతీయ కేత్ మజ్దూర్ యూనియన్ ఆధ్వర్యంలో మండల కేంద్రాల వద్ద నిర్వహించే ప్రదర్శనలను విజయవంతం చేయాలని కోరారు. కుంచె వసంతరావు, గోలిమి బాలయేసు, కంచర్ల గురవయ్య, పొట్టెల పెంటయ్య, మడిమి కామయ్య, కొక్కిరపాటి ఆనంద్ , తాడిగడప జయరాజు తదితరులు మాట్లాడారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

చింతలపూడి: విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనులు నిమిత్తం చింతంపల్లి ఫీడర్, మేడిశెట్టివారిపాలెం ఫీడర్‌ల పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. చింతలపూడి పట్టణంలో వెంకట్రామబాగ్, మోడల్ కాలనీ, ఫైర్ స్టేషన్ సెంటర్, సుప్రీం పేట ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.